

ఉష్ణోగ్రత: గరిష్ఠం 39.7 కనిష్ఠం 21.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (శనివారం సాయంత్రం)
సహర్: 4:50 (ఆదివారం ఉదయం)

సమాచారం

'యువ వికాసానికి' దరఖాస్తు చేసుకోండి

వికారాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పొందేందుకు 'రాజీవ్ యువ వికాసం' పథకానికి దరఖాస్తు చేసుకోవాలని డీఎండబ్ల్యూవో హన్మంత్‌రావు ఒక ప్రకటనలో కోరారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు పార్శీల్లో అర్హులైన అభ్యర్థులు ఓబీఎంఎంఎస్ పోర్టల్ tgobmms.cgg.gov.in ద్వారా ఏప్రిల్ 5లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వ్యవసాయ పథకాలకు 21- 55ఏళ్ల (జూలై1 నాటికి) వ్యవసాయ, సంబంధిత రంగాలకు 21-60 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సంవత్సరానికి రూ.1.50లక్షల లోపు ఆదాయం, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు మించకుండా ఉండాలన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం



వికారాబాద్, మార్చి, 28(ఆంధ్రజ్యోతి): పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తు గడువును మే 31 వరకు పొడిగించినట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25లో షెడ్యూల్డ్ కులం అభివృద్ధి శాఖలో 2,447 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా కేవలం 1,654 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారన్నారు. అర్హులైన వారు ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా మే 31 వరకు దరఖాస్తు చేసుకునేలా కళాశాలల యాజమాన్యాలు చూడాలని సూచించారు.



మూడు రోజులే!

ఆస్తి పన్ను వసూలుకు గడువు

ఆస్తి పన్ను వసూళ్లలో అధికారులు వేగం పెంచారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మూడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో శతశాతం లక్ష్యం చేరుకోవడం కష్టసాధ్యంగానే మారింది. పంచాయతీల్లో బకాయిలతో సహా వసూలు చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యాలను నిర్దేశించిన విషయం తెలిసిందే. వికారాబాద్ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం పన్ను వసూలు లక్ష్యం రూ.9.67 కోట్లు ఉండగా ఇప్పటివరకు 91 శాతం(8.76 కోట్లు) వసూలు చేశారు. మేడ్చల్ జిల్లా పన్ను వసూళ్లలో వెనకబడి ఉంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల నుంచి మొత్తం రూ.334.09 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, 24వ తేదీ వరకు రూ.214.12 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.119.96 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

- శతశాతంపై అధికారుల దృష్టి
- సెలవులు ఉండటంతో ఆందోళన
- మున్సిపాలిటీల్లో మందకొడిగా వసూళ్లు
- వికారాబాద్ జిల్లాలో 91శాతం పూర్తి
- లక్ష్యాన్ని చేరుకున్న మూడు మండలాలు
- వెనుకంజలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా
- దమ్మాయిగూడ మున్సిపాలిటీ ముందంజ

వికారాబాద్/మేడ్చల్, మార్చి28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పన్నుల వసూళ్ల ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ శతశాతం వసూలయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును సమీక్షించాలంటూ ఎంపీడీవోలు, ఎంపీవోలకు జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వికారాబాద్ జిల్లాలో 20 మండలాల పరిధిలో 595 పంచాయతీలు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.9,67,39,491 పన్నులు వసూలు లక్ష్యం ఉండగా ఈ పన్నుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.9,34,85,198 పన్ను సొమ్ము, రూ.32,54,298 బకాయిలు ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 91 శాతం(రూ.8.76 కోట్లు) వసూలు చేయగా, ఇంకా రూ.91 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూలుకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉన్నా, అందులో రెండు రోజులు(ఉగాది, రంజాన్) సెలవులు ఉండడంతో

మిగతా 8వ పేజీలో..

వికారాబాద్

పంచాయతీలు	584
మున్సిపాలిటీలు	04
పన్నుల వసూళ్ల లక్ష్యం	రూ.9.67 కోట్లు
వసూలు చేసినవి	రూ.8.76 కోట్లు
బకాయిలు	రూ. 91 లక్షలు

మేడ్చల్

కార్పొరేషన్లు	04
మున్సిపాలిటీలు	09
పన్నుల వసూళ్ల లక్ష్యం	రూ.334.09 కోట్లు
వసూలు చేసినవి	రూ.214.12 కోట్లు
బకాయిలు	రూ.119.96కోట్లు



'ఇఫ్తార్'లో స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కేంద్రంలోని చిగుళ్లపల్లి మైదానంలో శుక్రవారం మహబూబ్ అలీఖాన్ నవాబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు గ్యాక్ట్రస్టీ గడ్డం అనన్య, సుధాకర్‌రెడ్డి, ఎండీ హఫీజ్, తన్వర్‌అలీ, ముత్తహార్ షరీఫ్, మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న తేజోనిధి

పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు కృషి

ఘట్‌కేసర్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి ప్రాజెక్ట్ హెడ్ తేజోనిధి సూచించారు. యాదాద్రి-భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం, గూడురులోని ఇంటరైజ్ టోల్‌ప్లాజా సంస్థ రూ.10లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను ఆయన శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాములు, సంస్థ ప్రతినిధులు ఉపాధ్యాయులు నాగిరెడ్డి, ఎలిజబెత్, సుశీల, పీఈటీ లక్ష్మి, వాసవి, సుమరజిత, జయశ్రీ, మాధవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నల్ల మల్లారెడ్డిపై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి28(ఆంధ్రజ్యోతి): నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల ఛైర్మన్ నల్ల మల్లారెడ్డిపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం, కొర్రెముల, ఏకశిలనగర్ రెవెన్యూ పరిధి లోని సర్వేనంబర్ 739లో నుంచి దివ్యానగర్ వెళ్లే రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మాణం చేయడంతో హైడ్రా అధికారులు ఆ గోడను కూల్చివేసి రాకపోకలను పునరుద్ధరించారు. ఇటీవల మళ్లీ నల్ల మల్లారెడ్డి రాకపోకలు సాగనివ్వకుండా ఆ రోడ్డును దిగ్బంధించాడని గురువారం స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా ఇన్‌స్పెక్టర్ సైదులు పరిశీలించారు. హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు గాను పోచారం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి



ఏర్పాట్లపై ఎస్పీతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో నేడు(శనివారం) సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి కొడంగల్‌లో పర్యటించి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. కొడంగల్ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి పాల్గొనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, వైద్య సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయం ఆవరణలో శానిటేషన్, బారికేడ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక రాఘవేంద్ర ఫంక్షన్ హాలులలో సాయంత్రం ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్ విందుకు సంబంధించి మైనారిటీ నాయకులు, అధికారులతో మాట్లాడి అక్కడ సైతం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏడీ అర్జున్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎండీ.యూసుఫ్, నందారం ప్రశాంత్, నయీమ్, ముస్తాక్, తౌఫిక్, సుధాకర్‌రెడ్డి, శంకర్‌నాయక్, అశ్వాక్ తదితరులు పాల్గొన్నారు.



యువ ఉత్సవ్.. జోష్



- అలరించిన విద్యార్థుల నృత్యాలు
- దేశాభివృద్ధిలో యువత కీలకం
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి 'యువ ఉత్సవ్' కార్యక్రమం అలరించింది. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతీక్‌జైన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. యువత తలుచుకుంటే ఎంతటి కష్టమైనపని అయినా సాధిస్తారని అన్నారు. నచ్చిన రంగాల్లో యువత ప్రత్యేక సాధనతో ప్రతిభను చాటాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలతో యువతను ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఎందరో మహనీయులు దేశ ఐక్యత కోసం కృషి చేశారని, వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశాభ్యున్నతికి పాటుపడాలని సూచించారు.

బహుమతుల అందజేత

ప్రపంచంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సాంతికేక, వ్యాపార రంగాల్లో సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్లాలని సూచించారు. వ్యసనాలకు గురికాకుండా, సమాజంలో మంచి సందేశాన్ని ఇచ్చే విధంగా యువత వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. యువ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా పాటలు, జానపద, పల్లె నృత్య సైన్స్ ఫెయిర్, డ్రాయింగ్, కవిత్వం తదితర పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి ఐసయ్య, డీవైఎస్‌వో హన్మంత్‌రావు, డీఎంహెచ్‌వో వెంకటరవణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, వైస్ ప్రిన్సిపాల్ రామ సుబ్బారెడ్డి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్



భోగారంలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- సకాలంలో చెత్తను తొలగించని పారిశుధ్య సిబ్బంది
- దోమల నివారణకు చేపట్టని ఫాగింగ్
- ఆందోళనలో విలీన గ్రామాల ప్రజలు

బాబోయ్ దోమలు

రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం

కీసర, మార్చి28(ఆంధ్రజ్యోతి): అసలే మండుతున్న ఎండలు.. ఇంట్లో రోజంతా తీవ్ర ఉక్కపోత.. సాయంత్రం అలా అలా చల్లగాలికి ఆరుబయటకు వెళ్దామంటే విపరీతమైన దోమలు.. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో మున్సిపాలిటీల్లో విలీన గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో ఫాగింగ్ చేయకపోవడంతో దోమల బెడద తీవ్ర రూపం దాల్చింది. కొంతకాలంగా కీసర మండలంలోని 10 గ్రామాల్లోని కరీంగూడ, రాంపల్లి దాయర, భోగారం, గోధుమకుంట, నాగారం బల్దియాలో, కీసర, చీర్యాల్, యాద్గార్‌పల్లి, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి,



అంకిరెడ్డిపల్లి గ్రామాలు దమ్మాయిగూడ మున్సిపల్‌లో విలీనమైన విషయం తెలిసిందే. విలీనమైన ఏడు నెలల అనంతరం, ఇటీవల అసెంబ్లీలో అందుకు సంబంధించిన బిల్లు పాసైన విషయం తెలిసిందే. ఈ ఏడు నెలల కాలంలో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో దోమల నివారణపై అధికారులు దృష్టి సారించలేదు. దీంతో ఆయా గ్రామాల్లో దోమలు బెడద పెరిగిపోయింది. దీంతో జనాలు

మిగతా 8వ పేజీలో...

వీధుల్లోకి రాలేకపోతున్నాం



గ్రామంలో ఇటీవల పెరిగిన దోమలతో ఆరుబయటకు రాలేకపోతున్నాం. సాయంత్రం అయితే చాలు విచ్చలవిడిగా దోమలు ఇంటిని చుట్టుముడుతున్నాయి. దోమల బెడదతో ఎప్పుడు ఏ రోగం వస్తుందోనని తీవ్ర భయాందోళనకు గురవుతున్నాం. అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలి.

-చిందం వెంకటలక్ష్మి, గృహిణి, చీర్యాల్

ఏప్రిల్ 1నుంచి సన్నబియ్యం పంపిణీ

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



డీలర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1 నుంచి జిల్లాలో రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రేషన్ డీలర్లు, సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 30న సీఎం రేవంత్‌రెడ్డి సూర్యాపేట జిల్లాలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. డీలర్లు విధిగా సన్నబియ్యం పంపిణీ చేయాలని ఎవరైనా దొడ్డు బియ్యం పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో 588 రేషన్ షాపులకు సన్నబియ్యం సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు.



ఆమనగల్లు పోలీస్ స్టేషన్

ఏసీపీ కార్యాలయం ఏర్పాటెప్పుడో?

- నాలుగు మండలాలతో కలిపి ఏర్పాటుకు నిర్ణయం
- ఏడాదిన్నరగా ప్రతిపాదనలకే పరిమితం

ఆమనగల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. ఈ విషయంలో ఎవరూ చొరవచూపడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇక్కడ ఏసీపీ కార్యాలయాన్ని ప్రతిపాదించారు. కడ్తాలలో పోలీసుస్టేషన్ భవనం ప్రారంభ సందర్భంగా అప్పటి హోంమంత్రి మహమూద్ అలీ, అప్పటి డీజీపీ అంజన్‌కుమార్‌లు ఏసీపీ కార్యాలయాలు ప్రారంభిస్తామని చెప్పారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలతో కార్యాలయ ఏర్పాటు మరుగున పడింది. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల మండలాలతో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి పీఎస్‌లు సైబరాబాద్ కమిషనరేట్‌లో, మాడ్గుల స్టేషన్ రాచకొండ పరిధిలో ఉన్నాయి. మాడ్గులను కూడా సైబరాబాద్ పరిధికి మార్చి ఇక్కడ ఏసీపీ కార్యాలయ ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఇప్పుడు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి షాద్‌నగర్ ఏసీపీ కింద, మాడ్గుల ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలో కొనసాగుతున్నాయి. ఒకే నియోజవర్గంలోని నాలుగు మండలాలు రెండు అసిస్టెంట్/కమిషరేట్ల పరిధుల్లో కొనసాగుతుండడంతో పాలనాపర ఇబ్బందులు చోటుచేసుకుంటున్నాయి. ప్రజాప్రతినిధులకు కూడా ఇబ్బందికరంగా మారింది. షాదనగర్ ఏసీపీ ఆఫీసు ఆమనగల్లుకు 50కిలోమీటర్లు, ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయం మాడ్గులకు 40కిలో మీటర్ల దూరం ఉంది. ఏదైనా పని కలిగితే అక్కడికి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని ఈ మేరకు కృషిచేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీ మల్లు రవికి కూడా వినతిపత్రమిచ్చారు. ఎంపీ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినట్లు సమాచారం.

ప్రభుత్వం ప్రక్రియను ప్రారంభించాలి



ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయ ఏర్పాటు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలకు ఇదే విషయాన్ని విన్నవించాం. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల పోలీస్‌స్టేషన్లతో ఏసీపీ ఆఫీసు ఏర్పాటు చేస్తే శాఖాపరంగా మరిన్ని సేవలు అందుబాటులో ఉంటాయి. ఇప్పుడు కార్యాలయాలు దూరంగా ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే ప్రకియను ప్రారంభించాలి.

- గుర్రం కేశవులు, ఆమనగల్లు

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి



ఏసీపీ కార్యాలయం, డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. కార్యాలయాల ఏర్పాటుకు ఏళ్లుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాం. ధర్నాలు, దీక్షలు, ఆందోళనలూ చేపట్టాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కార్యాలయాల ఏర్పాటులో కాలయాపన చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆఫీసులు ఏర్పాటు చేసి ఇబ్బందులు తీర్చాలి.

- ఎర్రవోలు శ్రీను, ఆమనగల్లు

రాజీవ్ యువ వికాసం పథకానికి
దరఖాస్తు గడువు పెంచాలి

యాలాల, మార్చి28(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథక దరఖాస్తు గడువు ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. శుక్రవారం కేవీపీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మల్కయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాప పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయం సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రెండు రోజులు ఉగాది, రంజాన్ పండుగల సెలవులు ఉన్నందున యువత సర్టిఫికెట్లు పొందలేరన్నారు. మీ-సేవల్లో దరఖాస్తు చేసుకుంటే రేషన్‌కార్డు నంబర్ అడుగుతోందని, కొత్త రేషన్ కార్డులు జారీ కానందున స్కీంకు రేషన్ కార్డు నిబంధన తొలగించాలని కోరారు. నిబంధన తొలగించి, సెలవులు దృష్టిలో ఉంచుకొని దరఖాస్తు గడువు పెంచాలని కోరారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు నర్సింహులు, బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండల నాయకులు కృష్ణ, బీఎస్పీ తాండూరు ఉపాధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, యువకులు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



సినీ నటుడు సుమన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న నర్సింహారెడ్డి తదితరులు

కందుకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, భావితరాల కోసం హైదరాబాద్ టెక్నోస్కూల్ నిరంతరం పని చేయాలని సినీ నటుడు సుమన్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి అన్నారు. గురువారం రాత్రి కందుకూరులోని పాఠశాల వార్షికోత్సవంలో వారు మాట్లాడారు. 16సంవత్సరాల క్రితం పాఠశాలను స్థాపించిన ప్రిన్సిపాల్ ఎన్.రఘురాంరెడ్డి విద్యార్థులు విద్యారంగంలో రాణించేందుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అలాగే క్రీడారంగంలో రాణించేలా వారికి చేయుతనందిస్తున్నారని అభినందించారు. అనంతరం యాజమాన్యం పాఠశాల చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో నాయకులు జి.నారాయణరెడ్డి, మహేందర్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు రిటైర్మెంట్ తప్పదు

మోమిన్‌పేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని డీసీసీబీ ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్ అన్నారు. మేకవనంపల్లి సొసైటీ సీఈవో బాలకృష్ణ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం జేకేఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. బాలకృష్ణ-మల్లమ్మ దంపతులను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ బాలకృష్ణ అంకిత భావంతో పనిచేసి రైతుల మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ రామ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి, మోమిన్‌పేట్ సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వినయ్‌కుమార్, డీసీవో నాగార్జున, మొహ్మద్, మేనేజర్ నారాయణరెడ్డి, రవీందర్, నరేశ్, సీఈవో బ్రహ్మం, రవీందర్, శేఖర్ పాల్గొన్నారు.



బాలకృష్ణ-మల్లమ్మ దంపతులను సన్మానిస్తున్న రవీందర్‌గౌడ్

మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హనుమంతరెడ్డి



మేడ్చల్ టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చీదు హనుమంతరెడ్డి రెండో సారి విజయం సాధించారు. శుక్రవారం నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష పదవులు, ఇతర పదవులకు ఎన్నికలు నిర్వహించారు. హనుమంతరెడ్డి రెండో సారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా విజయగోపాల్‌రావు, ఉపాధ్యక్షుడు వినోద్, జాయింట్ సెక్రటరీ శేఖర్‌గౌడ్, కోషాధికారిగా అఫ్సర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం అహర్నిశలు పాటు పడతానని, మేడ్చల్ కోర్టు అభివృద్ధి కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని హనుమంతరెడ్డి అన్నారు.

హ్యాకథాన్‌లతో నైపుణ్యాల పెంపు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి28(ఆంధ్రజ్యోతి):హ్యాకథాన్లలో పాల్గొంటే సాంకేతిక నైపుణ్యాలు పెంపొందుతాయని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ నల్ల దివ్య తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, దివ్యనగర్‌లోని కళాశాలలో జరిగిన హ్యాక్ స్ప్రింట్-25 కార్యక్రమం జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి 32కళాశాలల నుంచి ఆర్టిఫిషియల్ ఇం టెలిజెన్స్, మెషిన్‌లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎంబడెడ్ సిస్టమ్స్, రొబోటిక్స్, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు రూ.50వేల చొప్పున నగదు, ప్రశంసాపత్రాల ను అందజేశారు. ప్రిన్సిపాల్ రమేష్, వైస్‌ప్రిన్సిపాల్ రాజశేఖర్, సీఎస్ సీ హెచ్‌వోడీ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు
సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సీడీపీవో కాంతారావు

తాండూరు రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని తాండూరు సీడీపీవో కాంతారావు అన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయంలో అదనపు సీడీపీవో శ్రీలక్ష్మితో కలిసి మాట్లాడారు. తాండూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జనన, మరణాల వివరాలన్నీ అంగన్‌వాడీ టీచర్ల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. వేసవిలో కేంద్రాలను మధ్యాహ్నం వరకే కొనసాగిస్తున్నట్లు చెప్పారు. అలాగే కుండ నీరు, గర్భిణులకు మజ్జిగ ఇవ్వాలని ఆదేశించామన్నారు. సిబ్బంది పిల్లల బరువు, ఆహారం నిల్వలు, ప్రీ స్కూల్ తదితర విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సుధాకర్‌గౌడ్, సుభాన్‌రెడ్డి



చేవెళ్ల. మార్చి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా మల్గాని సుధాకర్‌గౌడ్, బానోరు సుభాన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రైతు సంఘం మూడో మహా సభలు నిజామాబాద్‌లో ఈ నెల 25, 26, 27తేదీల్లో జరిగాయి. ఈ మహసభలో చేవెళ్ల మండలానికి చెందిన సుధాకర్ గౌడ్, సుభాన్‌రెడ్డిలు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నియ్యారు. వారు చేవెళ్లలో మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తామన్నారు. వారికి చేవెళ్ల మండల సీపీఐ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాలి



పరిగి మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

పరిగి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దేశంలో వక్ఫ్ బోర్డు అమెండ్‌మెంట్ బిల్లును వ్యతికేరిస్తూ శుక్రవారం పరిగిలో మసీదు వద్ద ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ముస్లింకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. బిల్లును వెనక్కి తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం దీనిని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అంగన్‌వాడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్ లావణ్య

శంకర్‌పల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మాజీ కౌన్సిలర్ లావణ్యశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి పరిధి సింగాపూర్ పాతబడిన అంగన్‌వాడీ సెంటర్‌ను సొంతంగా రూ.లక్షతో మరమ్మతులుచేయించి శుక్రవారం పునఃప్రారంభించారు. పాపిరెడ్డి, రాజిరెడ్డి, శేఖర్‌రెడ్డి,శంకరయ్య, సురేందర్‌రెడ్డి, ప్రతాప్, సురేష్, టీచర్ రుకియా ఉన్నారు.

మహిళా ఉపాధే 'ఐక్యత' ధ్యేయం

ఆమనగల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మహిళలు, యువతులకు ఉద్యోగ, ఉపాధి కల్పించడం ఐక్యత ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ, కడ్తాల మండలాలకు చెందిన 35 మంది మహిళలకు శుక్రవారం ఎలక్ట్రానిక్స్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించారు. వారికి రాఘవేందర్‌రెడ్డి, కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలను అందజేశారు. నియోజకవర్గంలో 132మంది మహిళలకు ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, రవియాదవ్, ఝాన్సీగంగ, అభినవ్‌రెడ్డి, కొండల్, పాల్గొన్నారు.



మహిళలు,యువతులతో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



ఇంటి యజమాని నుంచి చెక్కును తీసుకుంటున్న డీపీవో, ఎంపీడీవో

పన్ను వసూళ్లను నిర్లక్ష్యం చేయొద్దు

శంకర్‌పల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చేస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ హెచ్చరించారు. మోకిలలోని ఓ విల్లాలో ఆయన ఎంపీడీవో వెంకయగౌడ్‌తో కలిసి శుక్రవారం ఇంటింటికి తిరిగారు. ఇంటి పన్ను చెల్లించాలని విల్లాల యజమానులను కోరారు. అనంతరం మాట్లాడుతూ.. 100 శాతం పన్నులు వసూలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. పన్ను చెల్లించని ఇంటి యజమానులకు జప్తు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తను వేరుచేయడంతో పాటు ప్లాస్టిక్‌ను వాడరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీవో గిరిరాజ్, మోకిల పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య ఉన్నారు.

ప్రతీ గ్రామంలో టీడీపీ జెండా ఎగరాలి

మొయినాబాద్ రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మార్చి 29వ తేదీ శనివారం నాటికి తెలుగుదేశం పార్టీ స్థాపించి 43 సంవత్సరాలు పూర్తి అవుతోందని, ఈ తరుణంలో నేడు ప్రతి గ్రామంలో టీడీపీ జెండాను ఎగరేయాలని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, పొలిట్‌బ్యూరో మెంబర్ బక్కని నర్సింహులు అన్నారు. శుక్రవారం మొయినాబాద్ పరిధి హిమాయత్‌నగర్ చౌరస్తాలో టీడీపీ దిమ్మెకు పసుపు రంగు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. టీడీపీ పుట్టిందే బీసీల అభ్యున్నతికి అని, యువతను రాజకీయాల్లోకి తేవాలనే ఎన్టీరామారావు పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ తలకోటి హరికృష్ణ, మండల ఇన్‌చార్జి యాదయ్యగౌడ్, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ దిమ్మెకు రంగువేస్తున్న బక్కని నర్సింహులు

రోడ్డు దుస్థితి ఎవరికీ పట్టదా?

మొయినాబాద్ రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మున్సిపల్ పరిధి చిలుకూరు-మొయినాబాద్ రోడ్డు పనులు మధ్యలోనే నిలిపివేయడంతో వాహనదారుల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. ఈ మట్టి రోడ్డును గత ప్రభుత్వంలో బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.2.5కోట్లతో పనులను చేపట్టారు. కంకర వేసి పనులను ఆపేశారు. ఈ రోడ్డుపై వాహనాలు వెళ్తే లేస్తున్న దుమ్ముతో సమీప ప్రాంతమంతా కప్పేస్తోంది. రోడ్డు పక్కనున్న పంటలను దుమ్ము కమ్మేసి దిగుబడి రావడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు వెంటనే రోడ్డు పనులను పూర్తిచేసి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



చిలుకూరు-మొయినాబాద్ రోడ్డు దుస్థితి



మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

లాభాల బాటలో ధారూరు సొసైటీ

ధారూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎరువుల అమ్మకాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణతో వ్యవసాయ పరపతి సంఘం లాభాలార్జించిందని ధారూరు ప్యాక్స్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది రూ.44లక్షల ఆదాయమొచ్చిందని చెప్పారు. రైతులు తసుకున్న రుణాలను వెంటనే చెల్లించాలని కోరారు. రూ.10.50కోట్ల దీర్ఘకాలిక రుణాలుండగా రూ.3కోట్లే వసూలయ్యాయని చెప్పారు. రైతులు తమ బకాయిలను ఈ నెల 31లోగా చెల్లించాలని కోరారు. బంగారం తాకట్టుపై రూ.5.64 కోట్ల రుణాలు ఇచ్చామని చెప్పారు. రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, సీఈవో కె.నర్సింహులు, డైరెక్టర్లు ఎం.శివకుమార్, కరీం, పి.రవీందర్, టి.గోపాల్‌రెడ్డి, మల్లమ్మ, కె.గోపాల్‌రెడ్డి, తుల్జానాయక్, రైతులు పాల్గొన్నారు.

రూ.150కోట్ల రాయల్టీ వసూలు చేయాలి

- మైన్స్ అధికారులకు పెరిగిన ఒత్తిడి
- చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు

తాండూరు రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాయల్టీ వసూళ్లలో మైన్స్ అధికారులపై ఒత్తిడి పెరిగింది. దీంతో అధికారులు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు విస్తృతం చేశారు. తెలంగాణ సరిహద్దు గ్రామాలు, కర్ణాటక సరిహద్దు గ్రామమైన మిర్యాణ్ తదితర ప్రాంతాల్లో నాపరాతి గనులు విస్తరించి ఉన్నాయి. ఈ గనులతోపాటు తాండూరు నియోజకవర్గ పరిధిలో ఎర్రమట్టి, సుద్ద గనులు కూడా ఉండటంతో గనుల శాఖకు ప్రభుత్వం 2024-25ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూలుపై లక్ష్యం విధించింది. మార్చి ఆఖరులోగా రాయల్టీ కింద రూ.150 కోట్ల ఆదాయం వసూలు చేయాలని నిర్దేశించింది. దీంతో మైనింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ తన బృందంతో పగలు, రాత్రి తేడా లేకుండా తాండూరు మండల పరిధి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఇటీవలే రాయల్టీ లేకుండా వెళ్తున్న 11 లారీల యజమానులకు రూ.లక్షపైనే పెనాల్టీ విధించారు. నాపరాతి వ్యాపారం అంతంత మాత్రంగా ఉండటంతో నిబంధలు ఎత్తేయాలని వ్యాపారులు కోరుతున్నారు. ఈ నెలాఖరు వరకు రాయల్టీ లేనిదే లారీ చెక్‌పోస్టు దాటనివ్వం అని అధికారులు చెబుతున్నారు. లక్ష్యం రూ.150కోట్లకు ప్రస్తుతం రూ.128కోట్లు వసూలు చేశామని, మరో రెండు రోజుల్లో టార్గెట్ పూర్తికి కృషి చేస్తామని తెలిపారు. గతేడాది ఈ సమయానికి రూ.120కోట్లు వసూలు చేయగా, ప్రస్తుతం రూ.8కోట్లు అదనంగా వసూలు చేసినట్లు తెలిపారు.

4 నుంచి అన్మాస్‌పల్లిలో విత్తనాల పండుగ

కడ్తాల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ది ఎర్త్ సెంటర్‌లో ఏప్రిల్ 4 నుంచి 6వ తేదీ వరకు కౌన్సిల్ ఫర్‌గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో విత్తనాల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ చైర్మన్ కోర్పోలు లీలాలక్ష్మారెడ్డి తెలిపారు. హరిత విప్లవ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి రైతులు, విత్తన విక్రయదారులు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల దేశీయ విత్తనాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరవుతారని లీలాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

అవయవదానంపై అవగాహన అవసరం

దాతలు పెరగాలి.. జీవితాలు నిలవాలి ● ప్రచారం లేక ఆసక్తి చూపని మృతుల కుటుంబీకులు

ఆమనగల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మనిషి శారీకంగా మరణించినా శరీరంలోని వివిధ అవయవాలతో జీవించేలా చేసేది అవయవ దానం. నలుగురు ఆపన్నుల జీవితాల్లో వెలుగులు నింపే ఈ మహత్తర కార్యక్రమానికి సమాజంలో ప్రోత్సాహం కరువైంది. మూఢ నమ్మకాలు, అపోహలు, అవగాహన లేక ఎవరైనా చనిపోయినా, బ్రెయిన్‌డెడ్ అయిన సందర్భాల్లో అవయవ(ఆర్గాన్స్) దానాలకు ఆసక్తి చూపడం లేదు. రక్త, నేత్ర దానాలపై ప్రజలకు అవగాహన ఉన్నా.. మిగిలిన అవయవ దానాలపై కొన్ని సందర్భాల్లో తప్పితే పెద్దగా ఎవరూ పట్టించుకోవడం లేదు.



రక్తదానం చేస్తున్న యువకులు(ఫైల్)

మరణించినా జీవించగలిగే అవకాశం..

మనిషి మరణించినా జీవించినట్టు అనుభూతిని కల్గించేది అవయవ దానం. మరణానంతరం మనిషి శరీరంలోని 200ఆర్గాన్లు, టిష్యూలను దానంచేసే అవకాశం ఉంది. కళ్లు, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరి తిత్తులు, క్లోమం, పెద్ద/చిన్నపేగులు, ఎముకలు, మూలుగ ఇలా వివిధ అవయవాలను దానం చేయొచ్చు. ఒక వ్యక్తి మరణానంతరం వైద్యపరంగా అవసరమున్న వారిలో సగటున ఆరేడుగురికి నూతన జీవితాన్నివ్వొచ్చు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి. సమాజంలో నేటికీ మూఢాచారాలు పోలేదు. విద్యావంతులు సైతం అపోహలు వీడడం లేదు. ఆ దిశగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ఆస్పత్రులు చొరవ చూపాల్సి ఉంది.

డోనర్లు ఎవరంటే...

అవసరం ఉంటే బతికుండగానే రక్త సంబంధీకులకు అవయవ దానాలు చేయొచ్చు. వీరిలో తల్లి, తండ్రి, సోదరి, సోదరుడు, కూతురు, కొడుకు, భార్య వస్తారు. బతికుండగా ఇతరులకు అవయవదానం చేయాలంటే ప్రభుత్వ అనుమతి పొందాలి. ఆరోగ్యవంతులైన మేజర్లు అవయవదానాలకు అర్హులు. మరణానంతరం మాత్రం వైద్యపరంగా ఉపయోగపడే శరీరంలోని ఏ భాగాన్నైనా డొనేట్ చేసేందుకు సమ్మతివ్వొచ్చు. ఈ విషయంలో వయసుతో సంబంధం లేదు. అవయదానానికి ముందుకొచ్చే వారు మోహన్ ఫౌండేషన్, జీవన్‌దాన్, ప్రభుత్వాస్పత్రులు, కంటి వైద్యశాలలు, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను సంప్రదించొచ్చు. రక్తదానం బ్లడ్ బ్యాంకుల్లో చేయొచ్చు.

ఏ సమయాల్లో అవయవాలను సేకరించాలి?

మనిషి మరణానంతరం అవయవ సేకరణ అనేది గంటల్లో జరిగిపోవాలి. గుండె ఆగి చనిపోతే కల్లు, గుండె కవాటాల సేకరణ 6 నుంచి 24గంటల్లోపు చేయాలి. బ్రెయిన్‌డెడ్ పేషెంట్‌ను వెంటిలేటర్ నుంచి తీసుకొచ్చేలోపు అవయవాలను సేకరించాలి. సేకరించిన అవయవాన్ని బట్టి 5నుంచి 24 గంటల్లోపు అవసరమైన వారికి అమర్చాలి. ఇదంతా రిస్క్, ఖర్చుతో కూడుకున్నదే అయినా పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, పెరిగిన వసతుల నేపథ్యంలో వైద్యులు చాలా మంది రోగులకు అవయవ మార్పిడి చేస్తున్నారు. ఇదంతా పెద్దాస్పత్రుల్లోనే సాధ్యం. అయితే అవయవాల కోసం వేల మంది రోగులు ఎదురుచూస్తోంటే.. దాతల సంఖ్య పదుల్లో ఉంది. మరణించిన మనిషి అవయవాలను సేకరించకుండా అంత్యక్రియలు చేస్తే అవన్నీ వృథా అవుతాయి. దీనిపై ప్రజల్లో అవగాహన లేక ఈ సమస్య తలెత్తుతోంది. నేత్రదానంపై ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ప్రచారం చేస్తోంది. పదేళ్లలో క్లబ్ ద్వారా పది మంది నేత్రాలు సేకరించారు. సదస్సులు నిర్వహిస్తూ మరణానంతరం నేత్రదానానికి అంగీకార ప్రతాలను సేకరిస్తున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు.

విద్యావంతులు చైతన్యం తేవాలి



అవయవ దానాలపై ప్రజలు అపోహలు వీడాలి. ఈ విషయంలో విద్యావంతులు ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి. మృతుల అవయవదానాలపై వారి కుటుంబీకులు ముందుకొస్తే అవసరమున్న వారికి పునర్జన్మ ప్రసాదించినట్టే!

\- డాక్టర్ నాగరాజు, ఆమనగల్లు

ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి



ఒకరి నేత్ర దానంతో ఇద్దరు అంధులకు దృష్టిభాగ్యం కలుగుతుంది. నేత్ర దానంపై అవగాహన లేక చాలా మంది ముందుకు రావడం లేదు. ప్రమాదాల్లో మరణించిన వారి నేత్రాలను కూడా సేకరించలేకపోవడం దురదృష్టకరం. ప్రజా చైతన్యంతోనే ఆశించిన ఫలితాలు వస్తాయి.

\- చంద్రశేఖర్, నేత్ర వైద్యుడు

మూఢాచారాలు వీడాలి



రోడ్డు ప్రమాదాల్లో, సహజంగా మరణిస్తున్న వారి కుటుంబీకులు అవయవ దానాలకు ముందుకు రావాలి. అపోహల తొలగింపునకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు కృషిచేయాలి. ప్రజలు మూఢాచారాలు వీడాలి.

ప్రమోద్‌కుమార్, సీఐ, ఆమనగల్లు

విస్తృత ప్రచారం చేస్తున్నాం



నేత్ర, రక్త, అవయవ దానాలపై 20ఏళ్లుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. లయన్స్ క్లబ్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నేత్ర, రక్తదానంపై ప్రజల్లో చైతన్యం పెరిగింది. క్లబ్ ద్వారా సేకరించిన కళ్లను ఎల్వీ ప్రసాద్, ఎస్‌వీఎస్, సరోజిని దేవి ఆస్పత్రులకు అందజేశాం. పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ఎంఏ.పాషా, పీఆర్వో, లయన్స్ క్లబ్, ఆమనగల్లు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కడ్తాల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు శుక్రవారం పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టారు. తమ పదవీ కాలంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందిస్తలేదని పోస్టుకార్డుల నిరసనకు దిగారు. మండల కేంద్రాల నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి కార్డులు పోస్ట్ చేస్తున్నారు. కడ్తాలలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు కార్డులను పోస్ట్ చేశారు. బిల్లులివ్వాలని ఏడాదిన్నరగా కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పనుల కోసం చేసిన అప్పులతో మాజీ సర్పంచ్‌లు కష్టాలు పడుతున్నారని చెప్పారు. బిల్లులు చెల్లించే వరకూ పోరాటం చేస్తామన్నారు. విశ్వసుందరి పోటీల నిర్వహణకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం సర్పంచ్‌ల బిల్లులకు డబ్బుల్లేవా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు వెంకటేశ్, తులసీరామ్, యాదయ్య, భాగ్యమ్మ, లోక్య, సులోచనసాయిలు, మంజులచంద్రమౌళి, ప్రియరమేశ్, వీరయ్య, నర్సింహ, రామకృష్ణ, వినోద్, గోపాల్, లాయక్ అలీ, రామచంద్రయ్య గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆమనగల్లు: ఆమనగల్లులో సీఎంకు పోస్టు కార్డులు పోస్టు చేశారు. మాజీ సర్పంచ్ లు పోస్టాఫీస్ వద్ద సీఎంకు పోస్టు కార్డులను పంపారు. లక్ష్మణ్, సోనశ్రీను, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టుకార్డులను బాక్స్‌లో వేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి, తదితరులు

బిల్లుల కోసం పోస్టుకార్డు ఉద్యమం

ఇబ్రహీంపట్నం: మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ రాయపోల్ మాజీ సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి బల్వంతరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డు పంపారు. చేపట్టిన పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని రాష్ట్ర స్థాయి పోస్టుకార్డు ఉద్యమం చేపట్టాని చెప్పారు. 16నెలలుగా బిల్లులు రాక మనోవేదనకు గురవుతున్నామన్నారు. పలు మార్లు నిరసనలు తెలిపినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

సింహవాహనంపై స్వామివారు

- శ్రీ వేంకటేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు

కొడంగల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు సింహ వాహనంపై కల్కి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.





పురస్కారాలు అందుకుంటున్న సెయింట్ పీటర్స్ అధ్యాపకులు

పురస్కారం లభించడం గొప్ప విషయం

మేడ్చల్ టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష సంస్థ ఐఎస్ఆర్‌వోకు చెందిన భారతీయ దూర సంపర్క సంస్థ(ఐఐఆర్ఎస్) నిర్వహించిన అవుట్ రీచ్ కార్యక్రమంలో ప్రతిభ చూపడం అభినందనీయమని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి అన్నారు. జీఐఎస్, జీఎన్ఎస్ఎస్, జియో స్పేషియల్ టెక్నాలజీస్ వంటి అంశాలపై నిర్వహించిన కార్యక్రమంలో మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చడంతో సంస్థవారు ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల యాజమాన్యం శుక్రవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించింది. టీవీ.రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు, అధ్యాపకులు కళాశాలకు ప్రత్యేక గుర్తింపును తెచ్చారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సరోజరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజలకు రాజ్యాంగమే రక్ష

కీసర రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు రాజ్యాంగమే రక్ష అని మేడ్చల్ నియోజకవర్గ బి-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ అన్నారు. శుక్రవారం దమ్మాయిగూడలోని తిరుమల గార్డెన్‌లో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముప్పు రామారావు ఆధ్వర్యంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్, జై జగత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సాధన కోసం కృషిచేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. దేశాన్ని దిగుమతుల నుంచి ఎగుమతుల స్థాయికి చేర్చిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. ప్రజల అభివృద్ధికి, సమన్యాయ సాధన కోసం రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని అవహేళన చేసేలా ప్రవర్తిస్తున్నాయన్నారు. మనుధర్మం, సనాతన ధర్మం అంటూ ప్రజల మధ్య చిచ్చుపెట్టే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముందు ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు వెంకటేశ్, శ్రీలత, మేడ్చల్ ఏఎంసీ డైరెక్టర్ శ్వేత, పార్టీ మండల అధ్యక్షుడు క్రిష్ణయాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలు బలమణి, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, జూపల్లి శోభారాణి, శ్రీకాంత్‌రెడ్డి, యాదగిరిగౌడ్, అభిలాష్, రవి, గోవిద్‌సింగ్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి

మహేశ్వరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రాజు అన్నారు. శుక్రవారం మహేశ్వరంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఏప్రిల్ 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో మహాసభలు నిర్వహిస్తామని, అన్ని మండలాల కార్మికులు కార్మికులు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. మహిళా కార్మికులకు లేబర్ అడ్డాల వద్ద కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు గట్టిప్పలపల్లి గ్రామస్థులు పోరాటం ఉధృతం చేశారు. జేఏసీ చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 143వ రోజుకు చేరాయి. నాయకులు, వివిధ పార్టీల నేతలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

ఏఐపై పట్టు సాధించాలి

మేడ్చల్ టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని శాసిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్‌పై విద్యార్థులు పట్టుసాధిస్తేనే సాంకేతిక రంగంలో రాణిస్తారని టీఎస్‌ఎస్‌హెచ్ఈ చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి అన్నారు. మేడ్చల్‌లోని కిష్టాపూర్ ఎంఆర్ఈఎం కళాశాల వార్షికోత్సవాలను పురస్కరించుకొని టెక్నికల్, నాన్‌టెక్నికల్ ఈవెంట్ ముగింపు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్య ప్రపంచ భవిష్యత్తును మార్చే ప్రమాణమన్నారు. ప్రపంచ గమనాన్ని, దిశన మార్చే శక్తి ఇంజినీరింగ్‌కే ఉందన్నారు. విద్యార్థులు కొత్త కోర్సులపై దృష్టి పట్టు సాధించాలన్నారు. కళాశాల చైర్మన్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూనే సమాజ సేవకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కల్నల్ సి.నరేందర్‌రెడ్డి, సలహాదారులు సత్యనారాయణ, కాలేజీ కార్యదర్శి వి. కృష్ణారెడ్డి, సుబ్బరత్నం, రాఘవేందర్‌రెడ్డి, భరత్‌సింహారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలక్రిష్ణారెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్రాంరెడ్డి

రైతుల అభ్యున్నతే సొసైటీ లక్ష్యం

బషీరాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే లక్ష్యంగా సహకార సొసైటీ ద్వారా సేవలందిస్తున్నామని నవాంద్గీ ప్యాక్స్ చైర్మన్ ఎ.వెంకట్రాంరెడ్డి అన్నారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో సీఈవో బందెయ్యగౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సొసైటీ ఆదాయ, వ్యయాలు, లావాదేవీలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మట్లాడుతూ.. సొసైటీ రైతులకు అన్ని రకాల సేవలందిస్తూ రూ.1.2కోట్ల లాభాల్లో ఉందన్నారు. పంట, దీర్ఘకాలిక రుణాలతో పాటు బంగారంపై లోన్లు ఇస్తున్నామన్నారు. ఎరువులు, సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. రైస్‌మిల్లు, గోదాం పనులు పూర్తి అవుతున్నాయన్నారు. పెట్రోల్ బంకు నిర్వహణకు ఎన్వోసీ రావాల్సి ఉందని చెప్పారు. కాశింపూర్‌లో కొత్త సొసైటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపుతామన్నారు. భవనం పై మీటింగ్ హాల్, గెస్ట్ రూం నిర్మాణానికి తీర్మానించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, డైరెక్టర్లు అశోక్‌గౌతంచంద్ర, బి.శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, హన్మంతరెడ్డి, గోపాల్, పి.నవీన్‌రెడ్డి, ఎస్.గోపాల్‌రెడ్డి, అనసూయబాయి, సిబ్బంది వెంకటయ్య, రాజశేఖర్, ఫారూఖ్, తుకారం పాల్గొన్నారు.

పరిశ్రమలకు అవసరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

ఘట్‌కేసర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆర్మీ రిటైర్డ్ కమాండర్, వర్చుస సాఫ్ట్‌వేర్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ సంతోష్ నాగరాజన్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడలో గల నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం పరంపర 2025సదస్సును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిని కళాశాల వైస్‌చైర్మన్ నల్ల ప్రశాంత్‌రెడ్డి, డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కేజీ రెడ్డి ఇంజనీరింగు కళాశాలలో జరిగిన 2౩25 జాతీయస్థాయి క్రీడాఉత్సవంలో కబడ్డీ పోటీల్లో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి క్రీడాకారినులు విజేతలుగా నిలిచి బహుమతి సాధించగా వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్స్ శ్రీనాథ్ కశ్యప్, శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.


జ్ఞాపికలతో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కళాశాల కబడ్డీ క్రీడాకారులు

ఇంటర్న్‌షిప్ @ మెప్మా

● యువతలో నైపుణ్యాల పెంపునకు కృషి ● 31లోపు దరఖాస్తుకు అవకాశం

తాండూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ప్రధాని మోదీ నేతృత్వంలో ప్రభుత్వం బడ్జెట్‌లో పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను రూపొందించింది. రాష్ట్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో జీవనోపాధుల మిషన్ పర్యవేక్షణలో స్వయం ఉపాధి సంఘం సభ్యుల పిల్లలతో పాటు గ్రూప్ సభ్యులు కానీ యువతీ యువకులకు ఉపాధి అవకాశం కల్పించేందుకు ఈ ప్రోగ్రాం ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. ఇంటర్న్‌షిప్‌లో చేరే వారికి వ్యక్తిగత బీమా సౌకర్యం కల్పించారు. ఇప్పటికే ఉన్న పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా బీమా కల్పిస్తారు. ఇందుకు



గానూ కావాల్సిన ప్రీమియం సొమ్మును ప్రభుత్వమే భరిస్తుంది. నేషనల్ అప్రెంటిస్‌షిప్ శిక్షణపథకం(నాట్స్)లో ఇప్పటికే మున్సిపాలిటీలో నమోదు చేసుకున్న వారికి వచ్చేనెల నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

31లోగా దరఖాస్తు చేసుకోవాలి



పీఎం ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి మెప్మా టీఎంసీలు, కోఆర్డినేటర్లు, ఆర్పీల ద్వారా ప్రచారం చేస్తున్నాం. 21-24 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులు. టెన్త్, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ , బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ వంటి డిగ్రీలు ఉన్నవారు ఎవరైనా పీఎం ఇంటర్న్‌షిప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నెలకు రూ.5వేలు స్టైఫండ్ కింద ప్రభుత్వం రూ.4500, కంపెనీ రూ.500 అందిస్తోంది. యాదృచ్ఛిక ఖర్చులకు రూ.6వేలు వన్‌టైమ్ సాయం అందుతుందని అన్నారు. **- రవికుమార్, మెప్మా పీడీ వికారాబాద్**

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

నవాబుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం నవాబుపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మందికి ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. లక్షలు ఖర్చు చేసి కార్పోరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని వారికి సీఎంఆర్ఎఫ్ భరోసా ఇస్తుందన్నారు. ఈ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు మొరాయింపు


అనంతగిరి ఘాట్ రోడ్డులో నిలిచిన ఆర్టీసీ బస్సు

వికారాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ ఆర్టీసీ డిపోలోని బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. తాజాగా శుక్రవారం ధారూరు నుంచి వికారాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు అనంతగిరి ఘాట్ రోడ్‌లో ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల తీరుపై మండి పడుతున్నారు. ఎప్పుడు ఎక్కడ ఆగుతాయో తెలియని బస్సుల్లో ప్రయాణం ఎలా చేయాలని వాపోతున్నారు. అయితే వికారాబాద్‌కు ఈ మధ్య కాలంలోనే స్పీకర్ చొరవతో 16బస్సులు మంజూరు చేయగా ఆ బస్సులు రావాల్సి ఉంది.

'సంవిధాన్' అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఘట్‌కేసర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' అనే నినాదంతో రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మామిండ్ల ముత్యాలు అన్నారు. ఘట్‌కేసర్‌లోని నారాయణ గార్డెన్‌లో శుక్రవారం ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ ఎం.వెంకటేష్, కీసరగుట్ట ఆలయ డైరెక్టర్ సామల అమర్, కొంతం అంజిరెడ్డి, మల్లేష్, నాగరాజు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లంబాడాల, బంజారాల మాతృభాష గోర్‌బోలిని శాసనసభలో ఆమోదింప చేయడంతో శుక్రవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో గిరిజన నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బాపల్లి సంతోష్ నాయక్, రాంచంద్రారెడ్డి, మోత్యానాయక్, కిషన్ నాయక్, సూర్యప్రకాశ్, రాజునాయక్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

'అగ్నిపథ్'కు రాఘవేందర్ ఎంపిక



దుద్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లికి చెందిన బెర్కుటి పద్మమ్మ, హన్మయ్యల కుమారుడు బెర్కుటి రాఘవేందర్ యాదవ్ 'అగ్నిపథ్'కు ఎంపికై ఆర్మీ ఉద్యోగాన్ని సాధించాడు. తల్లిదండ్రులు వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ కుమారులను ఉన్నత చదువులు చదివించారు. వారి ఆశయాలను వమ్ము చేయకుండా కష్టపడి ఉద్యోగం సాధించిన రాఘవేందర్‌యాదవ్‌ను కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

బీటీ రోడ్డు పనుల ప్రారంభం

కొడంగల్ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్ నుంచి ఉప్పర్‌పల్లి వరకు బీటీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.ఆనంద్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తార్యానాయక్, సాయిలు, వెంకటయ్యగౌడ్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీరందించడం అభినందనీయం

కులకచర్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జాతరలో తాగునీరందించడం అభినందనీయమని ఎస్సై అన్వేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాంబండ జాతరలో ఇప్పయిపల్లి గ్రామానికి చెందిన పోతగాళ్ల పద్మమ్మ వెంకటయ్య సొంతంగా ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తున్నారు. శుక్రవారం జాతరలో ట్యాంకర్‌కు ఎస్సై పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇప్పయిపల్లి నర్సిములు పాల్గొన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి


సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న సందీప్‌కుమార్

వికారాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని కలిగి ఉండాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని సందీప్ మెడికల్ అండ్ క్లినియక్ నిర్వాహకులు సందీప్‌కుమార్ ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయగా, సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాటసారులకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

పరిగి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగిలోని బృందావన్ గార్డెన్‌లో శుక్రవారం సాయంత్రం రంజాన్ సందర్భంగా మహేశ్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్‌ను విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, మాజీ జడ్పీటీసీ మీర్‌మహమూద్ అలీ, ఏఎంసీ మాజీ చైర్మన్ అజారోద్దీన్, నాయకులు కె.అనిల్‌రెడ్డి, ఆర్.ఆంజనేయులు, బి.ప్రవీణ్‌రెడ్డి, నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.


పరిగిలో ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దుద్యాల: మండలంలోని పోలెపల్లిలో శుక్రవారం రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుర్ర పెంటయ్య యాదవ్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, మునవర్, జహంగీర్, కరీం, యూసుఫ్, నరేశ్‌గౌడ్, ముస్తాక్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

కోట్‌పల్లి: మండలంలోని కరీంపూర్‌లో శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాజీసర్పంచ్ సుందరి అనీల్ గ్రామంలోని ముస్లింసోదరులందరికీ రంజాన్ పండగ కానుకగా సొంతడబ్బులతో సరుకులు అందజేశారు. ముస్లింలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుద్యాల: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు నిలుస్తుందని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుర్ర పెంటయ్య యాదవ్ అన్నారు. మండలంలోని పోలెపల్లిలో శుక్రవారం రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, మునవర్, జహంగీర్, కరీం, యూసుఫ్, నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: పవిత్ర రంజాన్ పండగను పురస్కరించుకొని శుక్రవారం తూంకుంట మున్సిపల్‌లో మున్సిపల్ కమీషనర్ వెంకటగోపాల్ సిబ్బందికి రంజాన్ కానుకగా దుస్తులను(తోఫా) అందజేశారు. అక్సా వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా కమిషనర్ వెంకటగోపాల్ మున్సిపల్ సిబ్బందికి రంజాన్ పండగ సందర్భంగా దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్సా వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు మహబూబ్ జాని, కమిటీ సభ్యులు మక్బుల్, యూనస్, మీహనాజ్, ఇమ్రాన్, ఇస్మాయిల్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

మూడు రోజులే!

(ఐదో పేజీ తరువాయి)

నిర్దేశించిన లక్ష్య సాధన ప్రశ్నార్థకంగా మారింది.

ఆ మూడు మండలాల్లో శతశాతం..

వికారాబాద్ జిల్లాలోని బంట్వారం, కోట్‌పల్లి, వికారాబాద్ మండలాల పరిధిలో వందశాతం పన్నులు వసూలయ్యాయి. అలాగే 256 పంచాయతీల్లో పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేశారు. 18వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదైన వివరాల ప్రకారం నవాబ్‌పేట్, ధారూరు మండలాల్లో 97శాతం, పరిగిలో 96శాతం, బొంరాస్‌పేట్‌లో 95శాతం, చౌడాపూర్‌లో 94శాతం మేర పన్నులు వసూలు చేశారు. కులకచర్లలో 93 శాతం, దోమలో 92, దుద్యాల్, బషీరాబాద్‌ల్లో 91 శాతం, మోమిన్‌పేట్, కొడంగల్‌ల్లో 90 శాతం వసూలయ్యాయి. మర్పల్లిలో 89 శాతం, పూడూరులో 88, తాండూరులో 85, యాలాల్, పెద్దేముల్, దౌల్తాబాద్ మండలాల్లో 84 శాతం పన్ను వసూలు చేశారు. గతేడాదితో పోలిస్తే పన్నుల వసూళ్లు మున్సిపాలిటీల్లో మందకొడిగా సాగుతున్నాయి.

వికారాబాద్ జిల్లా ఆస్తి పన్నుల వివరాలు(రూ.కోట్లలో)

మున్సిపాలిటీ	వసూలు లక్ష్యం (బకాయిలతో కలిపి)	వసూలైనవి	బకాయిలు
తాండూరు	13.65	4.79	8.86
వికారాబాద్	4.90	3.80	1.10
పరిగి	1.80	1.75	0.05
కొడంగల్	1.64	1.31	0.33

పంచాయతీ ఎన్నికల ప్రక్రియతోనే ఆటంకం..

ఆస్తి పన్నుల వసూళ్లలో పంచాయతీలు ముందుండేవి. అయితే పన్నుల వసూళ్లపై దృష్టి సారించాల్సిన సమయంలో పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై అధికారుల నుంచి గ్రామ కార్యదర్శుల వరకు దృష్టి సారించడంతో పన్నుల వసూళ్లు మందగించాయి.

వేగం పెంచిన అధికారులు

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో నాలుగు మునిసిపల్ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల నుంచి ఈ ఏడాది పన్నులతో పాటు పాత బకాయిల రూపంలో రూ.334.09 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఈనెల 24వ తేదీ వరకు రూ.214.12 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.119.96 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. బకాయిలకు సంబంధించి రూ.73.39 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, రూ.23.63 కోట్లు వసూలు చేశారు. మేడ్చల్ జిల్లాలో పన్నుల వసూళ్లలో దమ్మాయిగూడ మునిసిపాలిటీ ముందంజలో ఉంది. కాగా, ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో పన్ను వసూళ్లలో అధికారులు వేగం పెంచారు.

మేడ్చల్ జిల్లా ఆస్తి పన్నుల వివరాలు(రూ.కోట్లలో)

కార్పొరేషన్/ మున్సిపాలిటీ	వసూలు లక్ష్యం (బకాయిలతో కలిపి)	వసూలైనవి	బకాయిలు
బోడుప్పల్	32.97	18.76	14.21
పీర్జాదిగూడ	43.24	30.06	13.18
నిజాంపేట్	75.39	52.06	23.33
జవహర్‌నగర్	14.79	8.17	6.62
దమ్మాయిగూడ	1.30	1.08	0.22
నాగారం	23.78	16.93	6.85
పోచారం	18.39	10.59	7.80
ఘట్‌కేసర్	12.28	6.89	5.39
మేడ్చల్	15.94	10.72	5.22
గుండ్లపోచంపల్లి	18.04	13.21	4.83
తూంకుంట	17.52	12.31	5.21
దుండిగల్	44.26	22.14	22.12
కొంపల్లి	16.14	11.15	4.99

బాబోయ్.. దోమలు

(ఐదో పేజీ తరువాయి)

సాయంత్రం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు.

పేరుకుపోతున్న చెత్త

విపరీతమైన దోమలతో ఏ రోగం వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా తదితర జబ్బులన్నీ దోమలతోనే వ్యాప్తి చెందుతుండటంతో ప్రజలు భయపడుతున్నారు. కొన్ని వార్డు కార్యాలయాల్లో పని చేసే కార్మికులకు తగిన సమయంలో జీతాలు రాకపోవడం, రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో అపరిశుభ్రత పెరిగిపోతోంది. దీంతో కూడా దోమల తీవ్రత ఎక్కువైందని ప్రజలు ఆగ్రహం చేస్తున్నారు. గతంలో గ్రామపంచాయతీ ఉన్న సమయంలో కార్యదర్శులను, సర్పంచ్‌లు నయానో.. భయానో ఫాగింగ్‌కు నిధులు కేటాయించి దోమల నివారణకు చర్యలు చేపట్టేవాళ్లు. ఇప్పుడు సర్పంచ్‌లు లేరు, పంచాయతీ కార్యదర్శులు లేరు, పాత పరిచయం ఉన్న మున్సిపల్ చైర్మన్లూ లేరు. ప్రభుత్వం అప్పగించే సర్వేలు, పన్నుల వసూలుతో పాటు, ప్రజల ఆరోగ్యం కాపాడాల్సిన బాధ్యత కూడా అధికారులు తీసుకోవాలని విలీన గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్‌లో విలీనమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గ్రామాలు విలీనమైన కాలంలో నిధులు సరిగ్గా లేకపోవడం, కుల గణన సందర్భంగా సర్వేకు ఎక్కువ సమయం కేటాయించడం జరిగింది. సమయం చూసుకొని దోమల నివారణకు చర్యలు చేపడతాం. అలాగే అన్ని గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి సారిస్తాం.

- నాగమణి, మున్సిపల్ కమిషనర్, దమ్మాయిగూడ

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ

దోమ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గూడూరు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణను శివానంద గురుస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గౌడవెల్లి గ్రామ సమస్యలను పరిష్కరించాలి

మేడ్చల్ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనం చేసిన గౌడవెల్లి గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ స్వామినాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో వీధి దీపాలు లేవని, రోడ్ల సమస్య ఉందని, మంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న గౌడవెల్లి గ్రామస్తులు

సంక్షిప్తంగా..

కేంద్రం నిధులతోనే పల్లెల్లో అభివృద్ధి

తాండూరు రూరల్: కేంద్రం నిధులతోనే పల్లెల అభివృద్ధి సాధ్యమని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి అన్నారు. తాండూరు మండలంలోని వీర్‌శెట్టిపల్లి గ్రామంలో శుక్రవారం ఎంపీ నిధులతో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ.12లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీడే నాగప్ప, జర్నప్ప, గోపాల్, పరశురాం, శంకర్, శ్రీనివాస్, శేఖర్, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

దిర్సంపల్లి తైబజారు రూ.92వేలు

దోమ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దిర్సంపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన తైబజారు వేలంలో తలారి వెంకట్రాములు రూ.92వేలకు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా తైబజారును దక్కించుకున్న వెంకట్రాములును గ్రామస్థులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఆర్.నరేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్ తైబజారు వేలం

మోమిన్‌పేట్: మోమిన్‌పేట్ గ్రామ పంచాయతీలో శుక్రవారం తైబజారుకు వేలం నిర్వహించారు. వేలంలో అరిగె మొగులయ్య రూ.3లక్షల 70వేలకు దక్కించుకున్నాడు. సంవత్సరం పాటు తైబజారు వసూలు చేసుకోవచ్చునని పంచాయతీ అధికారులు తెలిపారు. 1.4.2025 నుంచి 31.3.2026 వరకు తైబజారు వసూలు చేసేందుకు వీలుంటుందని తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని పోస్టు కార్డుల ద్వారా వినతి

దోమ: గ్రామాల అభివృద్ధికి బిల్లులు అందించకపోవడం శోచనీయమని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా పెండింగ్ బిల్లులు అందించడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ సర్పంచ్‌లతో కలిసి శుక్రవారం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే అందించాలని కోరారు.

క్రైం కార్నర్

ఈతకు వెళ్లి యువకుడి మృతి

పరిగి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పరిగి మండలం లక్నాపూర్ ప్రాజెక్టులో జరిగింది. ధారూర్ మండలం మోమిన్‌కలాన్ గ్రామానికి చెందిన ఎండీ ఫయాజ్(24), అదే గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి గురువారం పరిగిలో పని ఉందని చెప్పి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఇద్దరు కలిసి లక్నాపూర్ ప్రాజెక్టులో ఈతకు వెళ్లారు. ప్రాజెక్టులోని సిమెంట్ దిమ్మె తగలడంలో ఫయాజ్ నీటిలో మునిగి ఎంతసేపటికి బయటకు రాలేదు. అతని స్నేహితుడు రాజేందర్‌రెడ్డి ఫయాజ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఫయాజ్ తండ్రి రాత్రి వచ్చి నీళ్లలో వెతికిన ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం మరోసారి వెతకగా నీళ్లలో మృతదేహం కనిపించింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

భారీ వృక్షానికి మంటలు

చౌడాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శతాబ్దాల చరిత్ర కలిగిన మర్రిచెట్టుకు గురువారం రాత్రి మంటలు వ్యాపించాయి. ప్రతి ఏటా ఉగాది పండగ రోజు చెట్టు చుట్టూ కొత్తపల్లి గ్రామస్థులు శకటోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాలకు ముందు ఈ ప్రాంతాన్ని శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. స్థానికుల సాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మూడుచింతలపల్లి, మార్చి 28, (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలికి లిఫ్ట్ ఇస్తానని చెప్పి చైన్‌స్నాచింగ్‌కి పాల్పడిన ఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం, తిమ్మాయిపల్లికి గ్రామానికి చెందిన వరలక్ష్మి(80) దేవరాయంజల్‌లో తన పెన్షన్ డబ్బులు తీసుకొని తిరిగి ఇంటికి రావడానికి దొంగలమైసమ్మ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తోంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఇంటి దగ్గర దింపుతానని నమ్మించి ఆమెను బైక్‌పై ఎక్కించుకున్నాడు. కొద్ది దూరం వెళ్లాక ఒక వెంచర్‌లోకి తీసుకెళ్లి ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ


కొవ్వొత్తులు వెలిగిస్తున్న క్రైస్తవులు

తాండూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యకు నిరసనగా శుక్రవారం తాండూరులో క్రైస్తవ సోదరులు శాంతి ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఇందిరాచౌక్‌లో కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. హత్యను తీవ్రంగా ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన టెస్కాబ్ ఎండీ


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న కృష్ణారావు

తాండూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని రాష్ట్ర సహకార కేంద్ర బ్యాంకు (టెస్కాబ్) మేనేజింగ్ డైరెక్టర్ వై.కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కృష్ణారావును నూతనంగా నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేను కలిసి టెస్కాబ్ అంశాలపై చర్చించారు. నూతనంగా నియమితులైన కృష్ణారావుకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

ఎంసెట్ శిక్షణకు స్పందన

తాండూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తాండూరు సేవా భారతి, హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో బాలికల కోసం ప్రారంభించిన ఎంసెట్ ఉచిత శిక్షణకు మంచి స్పందన లభించింది. ఈనెల 23వ తేదీన ప్రారంభమైన తరగతులకు 175మంది బాలికలు ఉచిత శిక్షణలో చేరారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు.

పంచాయతీకి రూ.4.96లక్షల ఆదాయం

పెద్దేముల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ గ్రామపంచాయతీకి వేలం ద్వారా 4.96లక్షల రూపాయల ఆదాయం వచ్చింది. పెద్దేముల్ గ్రామపంచాయతీ తైబజార్, వాటర్‌ప్లాంట్‌కు శుక్రవారం ప్రత్యేకాధికారి ధీరజ్‌కుమార్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వేలంలో తైబజార్‌ను అదే గ్రామానికి చెందిన చాకలి రంగయ్య 1,90,600రూపాయలకు, వాటర్‌ప్లాంట్‌ను బోయిని వెంకటయ్య 3,05,500రూపాయలకు దక్కించుకున్నారు.

యువత చైతన్యవంతం కావాలి

పరిగి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా యువత చైతన్యవంతులు కావాలని పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీతాపద్మావతి అన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహనకు సంబంధించి శుక్రవారం కళాశాల ప్రాంగణంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డ్రగ్స్ కమిటీ కన్వీనర్ గంగాధర్, వైఎస్ ప్రిన్సిపాల్ డేవిడ్‌విల్సన్, అధ్యాపకులు సంపత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పూడూరు, మార్చి 28, (ఆంధ్రజ్యోతి): సైబేజ్ ఆశ ఆధ్వర్యంలో సోమన్‌గుర్తి గ్రామంలో శుక్రవారం రూ.7లక్షల రూపాయలతో 300మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, 8లక్షల 75వేలరూపాయలతో చేపట్టిన 200 మీటర్ల సీసీరోడ్డు పూర్తి అయిన సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలల్లో 3లక్షల 77వేల రూపాయలతో టాయిలెట్ బ్లాక్‌ను, దేవనూనోనిగూడలో అండర్ డ్రైనేజీని ప్రారంభించారు.